క్లుప్తంగా

సాయిబాబాకు పూజలు



విశేష అలంకరణలో దర్శనమిచ్చిన సాయిబాబా

టి.నరసాపురం : బొర్రంపాలెంలో సాయిబాబా ఆలయ 24వ వార్షిక వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబాకు గ్రామోత్సవం నిర్వహించారు. షిర్డీ సాయినాథుడిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజులు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకున్నారు. శనివారం వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు ప్రత్యేక లోక్‌అదాలత్



వివరాలు వెల్లడిస్తున్న జడ్జి పరేష్ కుమార్

చింతలపూడి : ఈనెల 18న చింతలపూడి కోర్టులో ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు చింతలపూడి ఫుల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి పరేష్ కుమార్ గురువారం తెలిపారు. లోక్ అదాలత్‌లో కుటుంబ తగాదా కేసులు, గృహహింస కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. రాజీ పడదగ్గ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కక్షిదారులు తమ న్యాయవాదులతో గాని, కోర్టు సిబ్బందిని గాని సంప్రదించాలన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



కోలాట బృంద సభ్యుడికి మొమెంటోను అందజేస్తున్న గారపాటి చౌదరి

లింగపాలెం : నరసన్నపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకోదండరామాలయ నిర్మాణానికి గురువారం తపన ఫౌండేషన్ అధినేత, రాష్ట్ర బీజేపీ నాయకులు గారపాటి చౌదరి రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. అలాగే భోగోలు పంచాయతీ వెంకటాపురం గ్రామ కోలాటం బృందం వారికి డ్రస్ మెటీరియల్, గజ్జలు తదితర వస్తువుల కొనుగోలుకు రూ.40 వేలు విరాళం అందజేశారు. అనంతరం వారికి మొమెంటోలు అందజేసి సత్కరించారు. తన వంతుగా గ్రామాలలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చౌదరి తెలిపారు.

తహసీల్దార్ విచారణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఆర్‌ఎస్ నెంబర్ 449లో ఉన్న 5 సెంట్ల స్థలం వివాదానికి సంబంధించి గురువారం తహసీల్దార్ కె.స్లీవజోజి విచారణ నిర్వహించారు. ఇరువర్గాల నుంచి స్థలానికి సంబంధించి దస్త్రాలను స్వీకరించి, వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. దస్త్రాలను పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

క్రిస్టియన్ సమాధుల తోట అభివృద్ధి

జంగారెడ్డిగూడెం : స్థానిక 8వ వార్డు టౌన్‌షిప్‌కు ఆనుకుని ఉన్న క్రిస్టియన్ సమాధుల తోట అభివృద్ధి పనులు గురువారం నిర్వహించారు. 30 ఏళ్లుగా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకపోవడంతో క్రైస్తవులు విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కమిషనర్ పి.భవానీ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన వారు అభివృద్ధి పనుల నిమిత్తం జేసీబీని కేటాయించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు ఆధ్వర్యంలో జేసీబీతో ఆ ప్రాంతంలో ఉన్న వృక్షాలను, పొదలను తొలగించడంతో పాటు ఎత్తుపల్లాలను సరిచేశారు. దీంతో వారికి క్రైస్తవులు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ రెడ్డి సంతాప సభ



డాక్టర్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని చంద్రమహల్‌లో గురువారం డాక్టర్ జంగా బాబు రాజేంద్ర ప్రసాద్ రెడ్డి సంతాప సభ నిర్వహించారు. కాసర వెంకటరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు డాక్టర్ రెడ్డి జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చేసిన సేవలను కొనియాడారు. పట్టణంలో ఆ రోజుల్లో కరెంట్ రావటానికి, డిగ్రీ, జూనియర్ కాలేజీల అభివృద్ధికి డాక్టర్ రెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. పేదవారికి ఉచితంగా వైద్యం అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జెట్టి గురునాధరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి మండవల్లి విజయసారథి, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ ముస్తఫా, మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు, రిటైర్డ్ జడ్జి కోరా నాగేశ్వరరావు, పలువురు వైద్యులు పాల్గొని డాక్టర్ రెడ్డికి నివాళులర్పించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



చింతలపూడిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో అమరజీవి పొట్టిశ్రీరాములు 122వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద వున్న పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మహంకాళి రంగ ప్రసాద్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దుబాగుంట్ల బాపిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహంకాళి రంగ ప్రసాద్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ కర్పూరం జనార్ధన్, కోశాధికారి గుళ్ళపూడి శ్రీనివాసరావు, ఏలూరి శ్రీనివాసరావు, ముక్కు సుబ్బారావు, తేజ, గుళ్ళపూడి రంగ నాయకులు పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు మొక్కవోని దీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీ రాములు నేటి తరానికి స్ఫూర్తి దాయకమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని బుట్టాయిగూడెం రోడ్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజధానిలో శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎంపీపీ మెయిన్ స్కూల్ విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ జోన్ చైర్మన్ చిన్ని సాయికుమార్, గుడిమెట్ల యుగంధర్, ఏలూరు ఫణికుమార్, వాసవి గోల్డ్ అధ్యక్షుడు సురేష్, సెక్రటరీ మణి తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో...

కామవరపుకోట : మండలంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. క్లబ్ రీజనల్ చైర్మన్ కొండూరు రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధన కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి ఆంధ్రుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. వాసవి, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు.

చింతలపూడిలో...

చింతలపూడి : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని చింతలపూడిలో గురువారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక తెలుగురాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు మాటూరి చక్రధరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణత్యాగం చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములు మహనీయుడని టి.నరసాపురం ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి అద్దంకి రవికుమార్ అన్నారు. టి.నరసాపురంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విజన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కుంతలగూడెం ప్రీ హైస్కూల్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ, బాలబాలికలు ఆయనకు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఎం.విజయ్, కె.అమృత పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



కామవరపుకోటలో నివాళులర్పిస్తున్న వాసవి, వనిత క్లబ్‌ల సభ్యులు



టి.నరసాపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే బాలరాజుకు అస్వస్థత

బుట్టాయగూడెం : వైరల్ జ్వరంతో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అస్వస్థతకు గురయ్యారు. గత నాలుగు రోజులుగా ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. కాగా ఇటీవలే తెల్లం బాలరాజు గుండె సంబంధిత చికిత్స తీసుకుని ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో వైరల్ ఫీవర్‌కి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెల్లం బాలరాజు మాట్లాడుతూ ప్రజలకు ఏదైనా అత్యవసర పనులు ఉంటే తన పీఏని గాని, సిబ్బందిని గాని ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

మొక్కజొన్న రెలుచును వాయిదా వేసుకోవాలి

కొయ్యలగూడెం : దిగుబడికి వచ్చిన మొక్కజొన్న రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు గురువారం సూచనలు చేశారు. రానున్న నాలుగు రోజులు వర్షాలు కురిసే పరిస్థితులు నెలకొని ఉండడంతో మొక్కజొన్న రెలుచు కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు. దీని వల్ల రైతుకు నష్టం ఉండబోదు అని, వారం రోజుల పిదప మొక్కజొన్న రెలుచు కార్యక్రమం నిర్వహించుకోవడం మంచిదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌బీకే సిబ్బంది, మండల వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

జంగారెడ్డిగూడెం : వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. వినియోగదారులు తప్పనిసరిగా తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. తూనికలు కొలతలు, ఆర్‌టీఐ చట్టాల గురించి వివరించారు. కామర్స్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ కె.ఉత్తమ్ సాగర్ మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ మండళ్లు, జిల్లా ఫారం రాష్ట్ర కమిషన్, జాతీయ కమిషన్ వాటిని వినియోగించుకునే విధానం, ప్యాకింగ్‌పై ఉన్న లేబుల్స్, వాటివలన మనకు కలిగే ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. అధ్యాపకులు వి.హనుమంతరావు, సీహెచ్.రమాదేవి, కేవీవీ శిరీష, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కోదండ రామయ్య విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



దేవతామూర్తులకు ధాన్యాధివాసం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : బయ్యనగూడెంలో నూతనంగా నిర్మించిన రామాలయం శుక్రవారం ప్రారంభం కానుంది. ఉదయం 11.18 గంటలకు సీతారామ లక్ష్మణ సమేత హనుమద్ శ్రీ కోదండ రామచంద్ర విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం నుంచి భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు. కాగా ఉత్సవాలను పురస్కరించుకుని నిర్మించిన యాగశాలలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. సుమారు 20వేల మందికి పైగా భక్తులు దర్శించుకునే విధంగా ఏర్పాటు చేసినట్లు ధర్మకర్త తుమ్మలపల్లి సూర్యచంద్రరావు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పట్టణంలోని పేరంపేట పెదరామాలయం వద్ద నివాసం ఉంటున్న జోగి వీరబాబుకు, దాక్షాయనికి 9 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. ఇటీవల భర్త అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని, ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ రాత్రి భర్త వీరబాబు చాకుతో గాయపర్చగా, అత్త సింహాచలం అతనికి సహకరించిందని బాధితురాలు దాక్షాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బుట్టాయగూడెం : మండలంలోని అల్లికాలువ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్రవాహనంపై వెళుతున్న కురసం చంద్రశేఖర్ అనే వ్యక్తి వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో విషజ్వరాలు

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



ద్వారకాతిరుమల పీహెచ్‌సీలో జ్వరపీడితులకు సూచనలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ద్వారకాతిరుమల : వైరల్ ఫీవర్స్ ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. తీవ్రమైన జ్వరం, వారం రోజులకు పైగా జలుబు, పొడిదగ్గు, ఒళ్లు నొప్పులు వేధిస్తున్నాయి. దీంతో గత కొద్దిరోజులుగా ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఈ వైరల్ జ్వరాల బారిన పడుతున్న వారిలో పెద్దలతో పాటు పిల్లలు అధికంగా ఉంటున్నారు. దగ్గు, ముక్కు కారడం, అధిక జ్వరం, కళ్లు మంటలు వంటి లక్షణాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ముందుగా శ్వాసకోశ సమస్యలు మొదలై, రెండు మూడు వారాలపాటు దగ్గుతో జ్వరం బారిన పడుతున్నారు. ఫ్లూకు కారణమయ్యే వైరస్‌ల ఉపరకం ఇన్‌ఫ్లూయంజా హెచ్‌3ఎన్‌2తో ఈ జ్వరాలకు సంబంధం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ తరహా జ్వరం కేసులు పెరుగుదలపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైద్య ఆరోగ్య విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు.

కేసుల గుర్తింపుపై దృష్టి..

వైరల్ జ్వరాల కేసుల్ని గుర్తించేందుకు ఫీవర్ సర్వేను నిర్వహించడం, ఐసీఎంఆర్ సూచించిన ప్రకారం అవసరమైన చికిత్సను అందించడంపై వైద్య, ఆరోగ్యశాఖ దృష్టి పెట్టింది. ఈ సీజన్‌లో ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య పెరుగుతుందని వైద్యులు అంటున్నారు. కరోనా సోకిన రోగుల తరహాలో ఒళ్లు నొప్పులు, శ్వాస సమస్యలతో బాధపడుతున్న రోగులు పది రోజులకు గానీ కోలుకోవడం లేదు. ఐసీఎంఆర్ సూచన ప్రకారం రోగ లక్షణాలను బట్టి చికిత్స చేస్తున్నామని, మందులను అధిక డోసులు ఇవ్వడం లేదని, అలాగే యాంటీబయాటిక్స్‌ను వాడటం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే 'ద ఇండియన్ మెడికల్ అసోసియేషన్' (ఐఎంఏ) కూడా ఎక్కువ డోసు కలిగిన మందులు, యాంటి బయాటిక్స్‌ను వాడొద్దని డాక్టర్లకు సూచించింది.

జాగ్రత్తలు తప్పనిసరి..

కొన్ని కేసుల్లో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది ఏర్పడటం, ఆకస్మికంగా ఆక్సిజన్ శాచురేషన్ పడిపోతున్న దృష్ట్యా ప్రజలు ముందు జాగ్రత్తలను పాటించడం తప్పనిసరని వైద్యులు సూచిస్తున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరించడం తప్పనిసరి చేసుకోవాలని, సమూహాలుగా ఉన్న ప్రదేశాలకు వెళ్లకపోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇక తరచూ సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడం, శానిటైజ్ చేసుకోవడం వంటివి చేయాలంటున్నారు. ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా అనిపించినప్పుడు, అధిక జ్వరం ఉన్నప్పుడు సొంత వైద్యం కాకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిదని స్పష్టం చేస్తున్నారు.

చికిత్స పొందితే సరిపోతుంది

ఫ్లూ వైరల్ మూడేళ్లకు ఒకసారి రూపం మార్చుకుంటూ ఉంటుంది. అలాంటప్పుడు ఆరోగ్య సమస్యలు తలెత్తడం సర్వసాధారణం. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. రోగ లక్షణాలు కనిపించినప్పుడు వైద్యుడిని సంప్రదించి తగు చికిత్స పొందితే సరిపోతుంది. తీసుకునే ఆహార విషయంలోనూ తగిన జాగ్రత్తలు చేపట్టాలి.

ప్రవీణ్ కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు, ద్వారకాతిరుమల

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం : కామవరపుకోట విద్యుత్ కేంద్రంలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరకడం తదితర పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం విద్యుత్ ఈఈ కేఎం అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.పోతేపల్లి, టి.నరసాపురం విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు ఉంటాయని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

కామవరపుకోట : ఈనెల 19వ తేదీన చింతలపూడి మార్కెట్ యార్డ్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఏఐటీయూసీ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు ఓ ప్రకటనలో కోరారు. ఈ మహాసభ కరపత్రాలను స్థానిక కొత్తూరు ముఠావర్కర్ యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏఐటీయూసీ సభ్యులు కంకిపాడు బుజ్జిబాబు, ముఠాసభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయంపై హర్షం



ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జంగారెడ్డిగూడెం నాయకులు



రాజవరంలో ఎమ్మెల్సీ విజయోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం,



కవురుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ కడిమి రమేష్

జంగారెడ్డిగూడెం : ఎమ్మెల్యే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించడంపై ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఏలూరు జెడ్పీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యేగా ఎన్నికైన కవురు శ్రీనివాస్‌ను గురువారం జంగారెడ్డిగూడెం నాయకులు కలిసి పూలమాలలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, కౌన్సిలర్లు ఉగ్గం ప్రసాద్, నేకూరి కిషోర్, అయినాల వెంకటరమణమూర్తి, నాయకులు బత్తిన చిన్న, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, పంది రాజాగౌడ్, గంజి వినోద్, గెద్దాడ శ్రీనివాసరావు, గుబ్బల అబ్బాస్, చింత అనిల్ కుమార్ గౌడ్, దోరేపల్లి విజయ్ ఉన్నారు.

కామవరపుకోట : ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసరావును గురువారం జెడ్పీటీసీ కడిమి రమేష్, కొత్తపల్లి శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొయ్యలగూడెం : ఎమ్మెల్సీల ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అఖండ విజయం పొందడం ప్రజాస్వామ్య విజయంగా జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి అభివర్ణించారు. ఈ సందర్భంగా రాజవరం గ్రామంలో సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు గ్రామ కన్వీనర్ శ్రీరంగం విశ్వనాథ్, కంచర్ల అన్నవరం, కొండేపాటి చింతయ్య, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కుంచే నాగలక్ష్మి, భీమడోలు వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం : ఎమ్మెల్సీగా విజయం సాధించిన కవురు శ్రీనివాస్‌ను గురువారం లింగపాలెం జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహనరావు కలసి అభినందనలు తెలిపారు.

కాంటూరులో చేర్చాలని బీ, సీ బ్లాక్ నిర్వాసితుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కుక్కునూరు బీ బ్లాక్ నిర్వాసితులు

కుక్కునూరు : మండలంలోని మరో 10 గ్రామాలను పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ చేర్చిన నేపథ్యంలో గురువారం కుక్కునూరు బీ, సీ బ్లాక్ నిర్వాసితులు కుక్కునూరు మొత్తాన్ని మొదటి కాంటూర్ పరిధిలో చేర్చాలని కోరుతూ తహసీల్దార్ డీఎల్ ప్రమద్వరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు మాట్లాడుతూ, కుక్కునూరు గ్రామాన్ని ఏ, బీ, సీ బ్లాక్‌లుగా విభజించిన అధికారులు ఏ బ్లాక్ మినహా తక్కిన గ్రామాలను 45 కాంటూర్ పరిధిలో చేర్చారన్నారు. కాని ఇటీవల వచ్చిన వరదలకు ముందు 45 కాంటూర్ పరిధిలో ఉన్న గ్రామాలు నీటమునిగాయన్నారు. గత జూలైలో వచ్చిన వరదలో ముంపు బారిన పడిన గ్రామాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు 10 గ్రామాలను మాత్రమే మొదటి కాంటూర్ పరిధిలోకి తీసుకోని తక్కిన గ్రామాలను పేర్కొనకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను పరిగణలోకి తీసుకోని నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, రావు వినోద్, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, అయితా కోటేశ్వరావు, మల్లేల చంటినాయుడు, సూర్ల రాము, వేల్పుల రవి, బీ, సీ బ్లాక్ కు చెందిన నిర్వాసితులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు



నేషనల్ హైవేపై వైట్ రబ్బర్ పెయింట్‌ను వేయిస్తున్న ఎస్సై ఎం.సాగర్‌బాబు

జంగారెడ్డిగూడెం : రహదారి ప్రమాదాల నివారణకు ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆదేశాల మేరకు సీఐ బాల సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సై ఎం.సాగర్ బాబు సిబ్బందితో కలిసి పలు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా గురువారం నేషనల్ హైవేపై బ్లాక్ స్పాట్‌ల వద్ద వైట్ రబ్బర్‌పెయింట్‌ను వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రిపూట వాహనదారులకు రోడ్డు పరిస్థితులను తెలియజేసేందుకు హైవేపై వైట్ పెయింట్‌ను వేయించినట్లు చెప్పారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న హైవేపై ప్రమాద హెచ్చరిక బోర్డులను, పెయింటింగ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రాత్రిపూట ప్రయాణించే వాహనదారులకు హెచ్చరికలు కనిపించే విధముగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే రాత్రిపూట వాహనదారులకు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.